పేరుకే పెద్దాస్పత్రి

- సేవలు పీహెచ్‌సీ స్థాయిలోనే..
- సీహెచ్‌సీలో డాక్టర్ల నియామకం లేక రోగులకు అందని సేవలు



తాళం వేసిన ఈసీజీ, ఎక్స్‌రే గదులు



ఉప్పునుంతలలో సీహెచ్‌సీ భవనం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) 30 పడకల ఆస్పత్రి నిర్మించి ఆర్భాటంగా ప్రారంభించినా రోగులకు వైద్య సేవలు మాత్రం అందని ద్రాక్షగానే మారాయి. పెద్దాస్పత్రి సేవలపై ప్రజలు నిరాశకు గురవుతున్నారు. గతం నుంచి ఉన్న మాదిరిగానే పీహెచ్‌సీ స్థాయిలోనే సేవలు అందుతున్నాయి. రూ.కోట్లు వెచ్చించి సీహెచ్‌సీకి అన్ని వసతులతో అధునాతన భవనం నిర్మించి కొన్ని విభాగాలకు సంబంధించిన పరికరాలు సమకూర్చినా డాక్టర్లను, సిబ్బందిని నియమించకపోవడంతో ఏమాత్రం ఫలితం లేదు. సీహెచ్‌సీకి సంబంధించి డిప్యూటేషన్‌పై నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాల నుంచి రోజు ఒకరిద్దరు నర్సులు మాత్రం వచ్చి వెళ్తున్నారు. ఉప్పునుంతల, అమ్రాబాద్, సీహెచ్‌సీలకు కలిపి ఒక సూపరింటిండెంట్‌ను నియమించారు. డెంటల్, చిన్న పిల్లల తదితర అన్ని విభాగాలకు సంబంధించి ఏడుగురు డాక్టర్లు ఉండాల్సిన సీహెచ్‌సీలో ఒక్క డాక్టర్‌ను కూడా నియమించలేదు. డెంటల్, ఎక్స్‌రే తదితర కొన్ని విభాగాలకు సంబంధించిన పరికరాలు మాత్రమే వచ్చాయి. సీహెచ్‌సీ కోసం నిర్మించిన భవనంలోనే పీహెచ్‌సీని కొనసాగిస్తున్నారు. పీహెచ్‌సీలో డాక్టర్లు సరిగా అందుబాటులో ఉండటంలేదనే ఆరోపణలు ప్రజల నుంచి విన్పిస్తున్నాయి. ఒక వేళ డాక్టర్ వచ్చినా మధ్యాహ్నం వరకు మాత్రమే ఉండి వెళ్తున్నారని వారు చెబుతున్నారు.

పీహెచ్‌సీ డాక్టర్లతోనే సీహెచ్‌సీ కొనసాగింపు..

డాక్టర్ల రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో కొత్తగా



తాళం వేసిన డెంటల్‌కు సంబంధించిన గది

ఏర్పాటుచేసిన సీహెచ్‌సీలో డాక్టర్ల నియామకం కాలేదని సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ సూపరింటిండెంట్ మణిప్రకాష్ తెలిపారు. దీంతో పీహెచ్‌సీ డాక్టర్లతోనే ప్రస్తుతం కొనసాగిస్తున్నాం. పీహెచ్‌సీలో ఉన్న ఇద్దరు డాక్టర్లలో ఒక మహిళా డాక్టర్ మెటర్నటీ సెలవుపై వెళ్లడంతో ఒక డాక్టర్ మాత్రమే ఉన్నారు. ఇటీవల అచ్చంపేట నుంచి ఒక డాక్టర్‌ను డిప్యూటేషన్‌పై ఇక్కడకు సర్దుబాటు చేశాం.

అన్ని గ్యారంటీలను అమలు చేస్తాం

- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

కందనూలు: కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మాదీ ప్రజా ప్రభుత్వమని, అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వాన్నికే దక్కిందన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని తెలిపారు. అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎప్పుడు ఏం మాట్లాడుతారో వారికే తెలీదన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. మన జిల్లాకు చెందిన వ్యక్తిగా, మన ప్రాంతంపై సీఎం రేవంత్ రెడ్డికి పూర్తి అవగాహన ఉందన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు.

మంత్రులను సన్మానించిన నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలో శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రానికి వెళ్తున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్‌శాఖ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులను మండల కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వెంకటయ్యగౌడ్, పర్వత్ రెడ్డి, నారాయణ, రషీద్ తదితరులు ఉన్నారు.

మన్ననూర్: మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్తూ మార్గ మధ్యలో మన్ననూర్‌లోని అటవీశాఖ విశ్రాంతి గృహంలో కాసేపు సేద తీర్చుకునేందుకు ఆగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి సన్మానం చేశారు. రహీం, వెంకటరమణ, సత్యనారాయణ, తుల్యా తదితరులు ఉన్నారు.

ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించండి

నాగర్‌కర్నూల్ క్రైం: రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న ఆరోగ్యమిత్రల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు శనివారం ఆరోగ్యమిత్రలు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కురుమయ్య మాట్లాడుతూ ఆరోగ్య మిత్రలందరికి ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్‌ను కల్పించాలన్నారు. ఆరోగ్యమిత్రలకు కనీసవేతనం రూ.28వేలతో పాటు టీఏ, డీఏ చెల్లించాలన్నారు. ఆరోగ్యశ్రీ సిబ్బందికి విధి నిర్వహణలో మరణించిన వారికి ప్రభుత్వం నుంచి రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బంగారయ్య, పారిజాత, సుజాత, మహేష్, పరశురాములు ఉన్నారు.

మహిళా సాధికారతకు కృషి

అచ్చంపేట రూరల్: ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేయనుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో పలు మహిళా సంఘాలకు పొదుపు డబ్బులను పంపిణీ చేశారు. ఆరెకటిక మహిళా సంఘం సభ్యులు 8ఏళ్లుగా సంఘం ఏర్పాటు చేసుకోగా పొదుపు డబ్బులను ఎమ్మెల్యే అందించారు. మహిళా సంఘాల బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని, మహిళా సంఘం భవన నిర్మాణాలకు సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్ గౌరీశంకర్, బాలాజీ, దుర్గాభవాని మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మీబాయి, లక్ష్మణ్, రాజు, దత్తాజీ, సక్కుబాయి, ఝాన్సీ, భవాని, వైష్ణవి పాల్గొన్నారు.



మహిళలకు పొదుపు డబ్బులు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ప్రతిగోడపై 'జై శ్రీరాం'

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఇందిరానగర్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటి గోడపై రామ మందిరం జైశ్రీరాం నినాదాలను రాయడం శనివారం ప్రారంభించారు. అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ట సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బాబీదేవ్ చెప్పారు.

బాలిక అదృశ్యం

లింగాల: మండలంలోని పద్మన్నపల్లికి చెందిన బాలిక అదృశ్యమైన ఘటన శనివారం వెలుగు చూసింది. ఈ నెల 18న ఇంటి నుంచి కుటుంబ సభ్యులకు చెప్పకుండ వెళ్లిన బాలిక తిరిగి రాలేదని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు: ఇద్దరికి గాయాలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల సమీపంలో శనివారం ఉదయం ఆర్టీసీబస్సు, బైక్‌ను ఢీకొన్న ఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న పరమేశ్వర్‌రెడ్డికి తీవ్ర గాయాలు కాగా, వెనకాల కూర్చున్న ఆయన కుమారుడు మహేందర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. పరమేశ్వర్‌రెడ్డి తన కుమారుడు మహేందర్‌ను పంజుగుల వద్ద దింపేందుకు వెళ్తుండగా, కల్వకుర్తి నుంచి తెలకపల్లి వైపు వెలుతున్న కల్వకుర్తి ఆర్టీసీ బస్సు మూల మలుపున ఢీకొట్టడంతో బైకుపై వెళ్తున్న వారికి గాయాలయ్యాయి. పరమేశ్వర్‌రెడ్డిని మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ పంపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ చెప్పారు.

కల్వకుర్తి సమగ్రాభివృద్ధే ధ్యేయం



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కల్వకుర్తిరూరల్: మండలంలోని బెక్కరలో పంచాయతీ భవనాన్ని ఎంపీ రాములు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశానన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్దే తన ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. బెక్కర సర్పంచ్ పాండురంగారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాభివృద్ధికి రూ.10లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్

అచ్చంపేట రూరల్: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న పారితోషకాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ రాములునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే పట్టణానికి వచ్చిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ... ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రకళ, రాజ్యలక్ష్మి, కమల, భాగ్యమ్మ, రజిత, బుజ్జమ్మ, కల్పన, వెంకటమ్మ, లక్ష్మి, పారిజాత, వెంకటమ్మ పాల్గొన్నారు.



నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

మట్టి టిప్పర్లకు జరిమానా

వెల్దండ: అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లకు శనివారం రూ.25వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లుకు ఈనెల 18న అనుమతి లేకుండా నేనావత్ దేవేందర్, నేనావత్ లక్ష్మణ్ మట్టిని తరలిస్తున్నారు. స్థానిక పోలీసులు దాడులు చేసి రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకోని స్టేషన్‌కు తరలించారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మట్టి ఉన్న టిప్పర్‌కు రూ.15వేలు, మట్టి తీసుకెళ్లడానికి వచ్చిన మరో టిప్పర్‌కు రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. అక్రమంగా మట్టిని, ఇసుకను తరలిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటరు నమోదుకు దరఖాస్తులు



కాంసానిపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీ సరస్వతి

ఉప్పునుంతల: మండలంలో 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ యువకులు విధిగా ఓటరు నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి సూచించారు. శనివారం మండలంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని సమీక్షించారు. 2024 జనవరి 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారు తమ ఎస్‌ఎస్‌సీ మార్కుల మెమోతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్‌లను జతచేసి దరఖాస్తులను సంబంధిత బీఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు. శని, ఆదివారం నిర్వహించే ఓటరు నమోదు కార్యక్రమంలో మొదటి రోజు 34 పోలింగ్ స్టేషన్లలో 35 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

పెద్దకొత్తపల్లి: యువతీ యువకులు కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఆదివారం వరకు ఎన్నికల సంఘం గడువు విధించింది. యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ యూసూఫ్ అలీ తెలిపారు.


చారకొండ: మండలంలోని ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని గ్రామాల్లో యువత సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రమీల అన్నారు. మండల కేంద్రంలో బీఎల్‌ఓలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ పర్యవేక్షించారు. మండలంలో శనివారం 21 కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ నమోదును బూత్ లెవల్ అధికారులలో ప్రత్యేక ఓటు నమోదు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

తాడూరు: మండలంలోని ఐతోలు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని శనివారం వ్యవసాయాధికారి సాయిరమేష్‌కుమార్ తనిఖీ చేశారు. ప్రతి పిండి సంచిని విక్రయించేటప్పుడు ఖచ్చితంగా రైతు ఆధార్‌కార్డు నమోదు చేసి విక్రయించాలని డీలర్‌కు సూచించారు. ఆ విధంగా అమ్మకాలు చేయకపోతే ఫర్టిలైజర్ యాక్ట్ ప్రకారం లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు షెడ్యూల్

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఆయా పంచాయతీ పాఠశాలలో ఉంచారు. మండలంలోని 6 ఉన్నత పాఠశాలలు, 27 ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆయా నోటీస్ బోర్డులపై శనివారం ఉంచారు. జాబితాలో అభ్యంతరాల స్వీకరణ 22, 23 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. తుది జాబితాను 24న ఉంతామని తెలిపారు. 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎన్నిక ఉంటుందన్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక అదే రోజు మధ్యాహ్నం 1:30 నుంచి జరుగుతుంది. మొదటి సమావేశం కూడా అదే రోజు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై కమిటీని ఎన్నుకోవాలని కోరారు.



అల్లాపూర్ పాఠశాలలో నోటిఫికేషన్‌ను ఉంచుతున్న ఉపాధ్యాయుడు

కోడేరు: మండలంలోని వివిధ పాఠశాలలో యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం కుర్మయ్య తెలిపారు. ఈ ఎన్నికలను ఈనెల 29న నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్ కమిటీ సభ్యులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

తెలకపల్లి: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్నారంలో శనివారం మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన ఉస్మాన్ గ్రామస్తుల వద్ద తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రామ్మోహన్, ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి పంచనామ నిర్వహించారు. 19 క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నారని వాటిని స్వాధీనం చేసుకుని, వాటిని తెలకపల్లి ఎంఎల్‌యస్ పాయింట్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఉస్మాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చారకొండ: అక్రమంగా వాహనంలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు శనివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. మండలంలోని సారంబండ తండాకు చెందిన దస్రునాయక్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాట్లు ఎస్ రవి తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్ పరిశీలించి స్వాధీన పరుచుకున్నారు. వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక డంప్‌లు సీజ్

ఉప్పునుంతల: ఉప్పునుంతల మండలం పెద్దాపూర్-దాసర్లపల్లి మార్గమధ్యంలోని వ్యవసాయ పొలాల్లో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంప్‌లను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సమీపంలోని దుందుభి వాగు నుంచి రాత్రివేళ ఇసుకను అక్రమంగా తరలించి డంప్ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. తహసీల్దార్ తబితారాణి ఆదేశాల మేరకు 50 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు ఆర్‌ఐ సుజాత తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

కొల్లాపూర్: పట్టణంలోని గాంధీహైస్కూల్, గరల్స్ హైస్కూల్‌లో జవహర్ నవోదయ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షలకు 321 మంది విద్యార్థులు హాజరయ్యారు. గాంధీ హైస్కూల్‌లో 188 మంది విద్యార్థులకు గాను 158 మంది, గరల్స్ హైస్కూల్‌లో 192 మందికి గాను 163 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శోభారాణి, విజయలక్ష్మి పర్యవేక్షించారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

సర్పంచ్‌లకు పర్సన్ ఇన్‌చార్జీగా బాధ్యతలు ఇవ్వాలి

కల్వకుర్తిరూరల్: స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే వరకు సర్పంచ్‌లకు పర్సన్ ఇన్‌చార్జీగా బాధ్యతలు అప్పగించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బెక్కరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పాండుగౌడ్‌తో కలిసి మాట్లాడారు. 10ఏళ్ల అధికారంలో ఉన్నప్పటికీ కేటీఆర్ ఏనాడు సర్పంచ్‌లను వారి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం పోయిన వెంటనే సర్పంచ్‌లు, వారి సమస్యలు గుర్తుకు రావడం హాస్యస్పదంగా ఉందన్నారు.

గ్రామాభివృద్ధికి చేయూతనివ్వాలి

తాడూరు: గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా చేయూతనివ్వాలని సర్పంచ్ యాదమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులపై వార్డు సభ్యులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వార్డుల వారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. పెండిగ్‌లో ఉన్న పనులను సభ్యులు గ్రామసభలో లేవనెత్తారు. సమావేశంలో ఎంపీటీసీ రేణుక, కార్యదర్శి పవన్‌కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రధాన రహదారి గుండా అంజనీమాత సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి మహిళలతో సీతారాముల శోభాయాత్రను కనుల పండువగా నిర్వహించారు. అయ్యప్పస్వామి దేవాలయం నుంచి ప్రారంభమై ఓం చౌరస్తా, కూరగాయల మార్కెట్, పురవీధుల గుండా పల్లకీసేవ నిర్వహించారు. జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్సీ

తెలకపల్లి: మండలంలోని రాకొండ చెందిన మాజీ వైస్ ఎంపీపీ నరేంద్రగౌడ్ అనారోగ్యంతో ఇటీవల చికిత్స పొందాడు. శనివారం సాయంత్రం ఆయన ఇంటి వద్ద ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి సందర్శించి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శుక్రవారం మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య, కర్ణకుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బతికె రాములును పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య, బాలగౌడ్, బతికె స్వామి తదితరులు ఉన్నారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శికి సన్మానం

చారకొండ: మండలంలోని జూపల్లికి చెందిన నాగర్‌కర్నూల్ డీసీసీ ప్రధాన కార్యదర్శి పాలాది బాల్‌రాజును శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల డీసీసీ ప్రనధాన కార్యదర్శిగా ఎన్నికైన సందున ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ అభినందించి, సన్మానించారు.

శ్రీశైలానికి పాదయాత్ర

మన్ననూర్: ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలనే సంకల్పంతోనే శ్రీశైలం పుణ్యక్షేత్రంకు సదాశివ గురుస్వామి తన శిష్యులు రవి ఘనాపాటీ, జితేంద్ర శర్మ, మోహిత్ శర్మతో పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. శనివారం మన్ననూర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆలయ పూజారి నర్సింహచారి సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం ఎలాంటి ఆందోళన, అశాంతికి తావు లేకుండా ప్రశాంతంగా ఉన్నట్లు ఇక్కడి పరిస్థితులను బట్టి గమనించానని తెలిపారు. ఎప్పటికి ఈ గ్రామం ఇలాగే ఉండాల కోరుకుంటున్నానన్నారు.

భవనాల పరిశీలన

పెద్దకొత్తపల్లి: వెన్నచర్లలో రూర్బన్ మిషన్ కింద నిర్మించిన మీసేవా, గ్రంథాలయం తదితర భవనాలు ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రారంభానికి సిద్ధమైన భవనాలను త్వరలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఎంపీటీసీ రవికుమార్, పర్వతాలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆల్ ఇండియా క్రికెట్ టోర్నీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం నుంచి సీవీకే ఆల్ ఇండియా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామని ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ కపిలవాయి చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి రఘురాం తెలిపారు. టోర్నీలో విన్నర్ జట్టుకు రూ. 3లక్షలు, రన్నర్ జట్టుకు రూ.2లక్షలు అందిస్తారని తెలిపారు.

క్లుప్తంగా

ఉప ముఖ్యమంత్రికి సన్మానం

వెల్దండ: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ శనివారం హైదరాబాదులోని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో శేఖర్, పుల్లయ్య, హమీద్, గోపాల్‌నాయక్, వెంకటయ్య, జగన్, వెంకటేశ్వర్‌రెడ్డి, చంద్‌నాయక్ తదితరులు ఉన్నారు.

భోజనశాల నిర్మాణానికి విరాళం

కల్వకుర్తిరూరల్: మండలంలోని రామగిరిలో వెలసిన సీతారామచంద్ర స్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకుడు ఆశాదీప్‌రెడ్డి భోజనశాల నిర్మాణానికి రూ.3 లక్షల విరాళాన్ని శనివారం అందజేశారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలస్వామి, రవి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల బాలికల కళాశాలలో ప్రవేశాలు

కల్వకుర్తి టౌన్: మైనార్టీ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా కల్వకుర్తి మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అర్షియా ఖాతూన్ శనివారం ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో 40 సీట్లు ఉన్నాయని, వాటిలో 30 మైనార్టీలకు, మిగిలిన సీట్లను ఇతర కులాలకు చెందిన వారికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పరీక్షల ఫలితాలు వెలువడిన తర్వాత మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు గిగిగి.భీ ఖఉఐ భీఉఔఆ్రాఎఆ్రాఅ.ఇఎఎ.ఎ గ్ఐ్రా వెబ్ సైట్ ద్వారా ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7207998974 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం డీటీఎఫ్ క్యాలెండర్‌ను మండల నోడల్ అధికారి బలరామకృష్ణ, జిల్లా కార్యదర్శి నర్సింహ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు హక్కులతో పాటు బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అర్జున్‌గౌడ్, నారాయణ రెడ్డి, శ్రీనివాసులు, శ్రీధర్, కురుమూర్తి, స్వప్న, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం టీయూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ శంకర్‌నాయర్, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శైలం, పోషయ్య, విజయ్‌కుమార్, తిరుపతయ్య, వెంకటయ్య, రాఘవేందర్, ఉమాదేవి ఉన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

కల్వకుర్తిరూరల్: సమాజంలోని ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ రాంచంద్రారెడ్డి కోరారు. శనివారం మండలంలోని వెంకటాపూర్‌లో వీరహనుమాన్ యువజన సంఘం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శ్రీరామమందిరం ప్రారంభోత్సవానికి సూచికగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 30 మంది రక్తదానం చేశారు.

క్రీడాసామగ్రి పంపిణీ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వామి వివేకానంద సేవాబృందం అధ్యక్షుడు శివ క్రీడాసామగ్రిని శనివారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం బాలునాయక్, మనీష్ గౌడ్, సతీష్, చింటు, హర్షిత్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

రేపు సెలవు ప్రకటించాలని వినతి

ఉప్పునుంతల: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని 22న ప్రభుత్వం సెలవు ప్రకంటించాలని కోరుతూ శనివారం తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక తహసీల్దార్ తబితారాణికి వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసులు, జగదీశ్వర్, ఆంజనేయులు, రాజేష్, మల్లారెడ్డి, సురేందర్‌గౌడ్, అనురాధ, కల్పన, శ్రీలత, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో అగ్నిప్రమాదం

తెలకపల్లి: తెలకపల్లి మండలంలోని ఆలేరు ఆరోగ్య ఉపకేంద్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. ఆలేరు ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి మంటలు చెలరేగడంతో వైద్య సామగ్రి కాలిపోయింది. విషయం తెలుసుకున్న డాక్టర్ శివరాజు ఉపకేంద్రానికి చేరుకుని పరిశీలించారు. దాదాపు రూ.40వేల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. డాక్టర్ శివరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.